



అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 పేజీలు : 04


# దేవాలయాల అభివృద్ధికి నిధులు ఇవ్వండి

- దేవాదాయశాఖ మంత్రి ఆనంకి ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన మంత్రి ఆనం
- మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీత



దేవాదాయ శాఖ మంత్రి ఆనంకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



మాజీ ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని.. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డికి ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆమె మంత్రిని ప్రత్యేకంగా కలసి ఆలయాల పరిస్థితి గురించి చర్చించి.. నిధుల మంజూరు కోసం వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.14.20కోట్లు మంజూరు చేయాలని కోరారు. శ్రీ పండమేటి వెంకటరమణ స్వామి దేవాలయంకి అదనంగా గాలిగోపురం, రోడ్డు, భజన మందిరం, శ్రీదేవి భూదేవి మందిరాలు నిర్మాణం, ధ్వజస్తంభం, లక్ష్మిదేవి దేవాలయ నిర్మాణం, రాజగోపురం, ప్రాకారం, ఫ్లోరింగ్ కోసం రూ.5.86 కోట్లు మంజూరు చేయాలని కోరారు. రామగిరి మండలం నసనకోట శివాలయం, వెంకటాపురంలో ఉన్న పెద్దమ్మ గుడి, గంగంపల్లి తండాలో ఉన్న మారెమ్మ గుడి, ఎస్సీ కాలనీ మాదాపురంలో ఉన్న పెద్దమ్మ గుడి, అలాగే చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం శివాలయం, ఆత్మకూరు మండలం తలుపూరు పెద్దమ్మ అమ్మవారి దేవాలయాలు నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం రూరల్ మండలం సోమల దొడ్డిలో ఉన్న అశ్వర్థ నారాయణస్వామి ఆలయం మరమ్మత్తులు, డైనింగ్ హాల్ నిర్మాణం కోసం నిధులు అవసరం అన్నారు. నియోజకవర్గంలోని 6మండలాల్లోని దేవాలయాలకు ధూప దీప నైవేద్యం, అర్చకుల జీతాల కోసం కమిషనర్‌కి నివేదికలు పంపామన్నారు. నియోజకవర్గంలో 45 భజన మందిరాలను మంజూరు చేసి నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే సునీత వినతులపై మంత్రి ఆనం సానుకూలంగా స్పందించారు. అన్ని అంశాలు పరిశీలించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా మంత్రి సవితమ్మను కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై వినతిపత్రం అందజేశారు. మరోవైపు మాజీ ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌ని శాసనసభ స్పీకర్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీత మర్యాదపూర్వకంగా కలిశారు. గత ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఇద్దరు మంత్రులుగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి గురించి చర్చించుకున్నారు. నియోజకవర్గంలో ఆసుపత్రుల నిర్మాణాలు కోసం అవసరమైన నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో రాప్తాడులో చాలా అభివృద్ధి చేశారని మాజీ మంత్రి కామినేని అన్నారు.హంద్రీనీవాపీఏబీఆర్ కాలువల్ని అనుసంధానం చేయండి అని కోరారు.

# చంద్రమౌళీశ్వరా పాహిమాం..!!

- వైభవంగా చంద్రమౌళీశ్వరస్వామి మహా రథోత్సవం
- సాంప్రదాయ బద్ధంగా కొనసాగిన రథోత్సవం పూజా కార్యక్రమాలు
- చంద్రమౌళీశ్వస్వామి, గవిసిద్దేశ్వరస్వామివార్లకు ప్రత్యేక పూజలు
- రథోత్సవానికి వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు
- గుంతకల్లు డీఎస్పీ పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తు
- 35 నిమిషాల పాటు ఏకధాటిగా కొనసాగిన రథోత్సవం



జనవాహిని మధ్య చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం సాగుతున్న దృశ్యం

**ఉరవకొండ, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన ఉరవకొండ పట్టణంలోని గవిమఠ సంస్థానంలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి మహా రథోత్సవం స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం పాల్గుణ శుద్ధ దశమి గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. మహా రథోత్సవం సందర్భంగా ఉదయం నుండి చంద్రమౌళీశ్వరునికి, గవిసిద్దేశ్వరునికి, మఠం తొలి పీఠాధిపతి కర్తృ కరిబసవస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సాంప్రదాయం ప్రకారం చంద్రమౌళీశ్వరుడి ఉత్సవమూర్తిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గవిమఠం సంస్థానం 8వ పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్ర మహాస్వామి ఆధ్వర్యంలో ఉత్తరాధికారి జగద్గురు డాక్టరు కరిబసవరాజేంద్రస్వామి, ఆదోని చౌకీ మఠం కళ్యాణస్వామి, సహాయ కమీషనర్, మేనేజర్ గంజి మల్లికార్జున ప్రసాద్, వివిధ మఠాల పీఠాధిపతులు వెంటరాగా ఊరేగింపుగా తీసుకొచ్చి అత్యంత శోభాయమానంగా పూలు, బొమ్మలు, అరటి గెలలు, మామిడి తోరణాలతో అలంకరించిన బ్రహ్మరథంలో కొలువుదీర్చారు. అనంతరం బలిహరణ, ఇత్యాది సాంప్రదాయ పూజా కార్యక్రమాలు జరిపి బ్రహ్మ రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలు బాజా భజంత్రీల నడుమ బాణా సంచా పేల్చి గజలక్ష్మి ముందు నడుస్తుండగా 'హరహర మహాదేవ శంభో శంకర' చంద్రమౌళీశ్వర పాహిమాం అంటూ రథాన్ని 5.35 గంటల సమయంలో భక్తులు ముందుకు లాగారు. రథాన్ని ఎదరుబసవన్న గుడి వరకు లాగి అక్కడ బసవేశ్వరుడి ఆలయంలో పూజల అనంతరం తిరిగి 6.20 గంటలకు యథాస్థానానికి చేర్చారు. దారిపొడవునా రథంపై భక్తులు చీనీ, అరటి కాయలను విసిరి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. రథోత్సవ కార్యక్రమంలో వేలాదిగా భక్తులు హాజరుకావడంతో మఠం ప్రాంగణం కిక్కిరిసి కనిపించింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్, మఠం ఏజెంటు పి.రాజన్నగౌడ్, వివిధ ఆలయాల కార్యనిర్వహణ అధికారులు అంగదాల క్రిష్ణయ్య, సాకే రమేష్‌బాబు, బి.విజయ్‌కుమార్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, ఏసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రామతులసి, వీరశైవ సమాజం బాధ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**గ్రామ పంచాయితీ ద్వారా రథానికి పూలమాలల సమర్పణ:**

ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయితీ ద్వారా సంప్రదాయం ప్రకారం చ ంద్రమౌళీశ్వరస్వామి వార్ల బ్రహ్మ రథానికి భారీ పూలమాలలను సమర్పించారు. స్థానిక మేజర్ పంచాయితీ కార్యాలయం నుండి సర్పంచ్ మీనుగ లలిత, పంచాయతీ పరిపాలన అధికారి షేక్ మహమ్మత్ రఫీ, వార్డు సభ్యులు, ఉద్యోగులు సిబ్బంది భారీ పూలమాలలను, మిఠాయిలను మేళాతాలతో గజలక్ష్మి వెంట నడవగా గవిమఠానికి చేర్చి రథానికి అలంకరించారు. అనంతరం అధికారులు పీఠాధిపతి ఆశీర్వచనాలు తీసుకోగా భక్తులకు పంచాయితీ ద్వారా మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం పీఠాధిపతి జగద్గురు చంద్రమౌళీశ్వరస్వామి ఆశీర్వచనాలు పొందారు.

**శివయ్యకు గణపయ్య సాయం:**

కాగా చంద్రమౌళీశ్వరస్వామి రథం ఎదురు బసవన్న గుడివద్ద నుండి వెనక్కు వచ్చే సమయంలో కొద్దిసేపు మోరాయించగా మఠం ఏనుగు గజలక్ష్మి సాయం అందించింది. రథం ఎదురుబసవన్న గుడి వరకు సాఫీగానే చేరుకొని అక్కడి నుండి తిరిగి వేగంగానే యథాస్థానానికి చేరుకునే సమయంలో కొంతసేపు మోరాయించింది. గణపయ్య సాయంతో ఎక్కడా ఎలాంటి ఆటంకం లేకుండా రథోత్సవ కార్యక్రమం సాఫీగా సాగడం విశేషంగా చెప్పాలి.

**పోలీసుల భారీ బందోబస్తు:**

బ్రహ్మరథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ట్రైనీ ఐపీఎస్ అశ్విన్ మన్‌దీప్, గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉరవకొండ, గుంతకల్లు, కూడేరు, వివిధ సర్కిళ్లకు చెందిన వందలాది మంది పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులతో ఉరవకొండ యుపీఎస్ సీఐలు బి.మహానంది, ఎస్‌ఐ పి.జనార్ధననాయుడు బృందం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.



రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తజన సందోహం



చంద్రమౌళీశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపులో పాల్గొన్న ఉత్తరాధికారి జగద్గురు కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమీషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్ తదితరులు



రథం ముందు సంప్రదాయ పూజల నిర్వహిస్తున్న దృశ్యం



నడవలేని స్థితిలో ఉన్న పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామిను కుర్చిలోసహా మోసుకొస్తున్న దృశ్యం



రథోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా గవిమఠం ఏనుగు



రథాన్ని తోస్తున్న గవిమఠం ఏనుగు (గజలక్ష్మి)



తెడ్లను తీసుకెళుతున్న వడ్డేర్లు



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అశ్విన్ మన్‌దీప్, డీఎస్పీ శ్రీనివాసులు



ప్రత్యేక పూజలందుకున్న గవిసిద్దేశ్వరస్వామి

# క్షేత్రస్థాయిలో రైతులకు పథకాలను మరింత చేరువ చేయాలి

- కేంద్ర అధికారి సిద్ధార్థ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**పుట్టపర్తి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

క్షేత్రస్థాయిలో రైతులకు పథకాలను మరింత చేరువ చేయాలని ఆధునిక సాగు పద్ధతులపై దృష్టి, చియా పంటలను జిల్లా అంతట విస్తరింప చేయాలని ప్రధాని ధనధాన్య కృషి యోజన అమలుపై కేంద్ర అధికారి సిద్ధార్థ జైన్ గురువారం సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మరియు వివిధ వ్యవసాయ అను బంధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ శ్రీ సత్యసాయి జిల్లాలో చేపడుతున్న చర్యలను కేంద్ర అధికారికి వివ రించారు. వేరుశనగ టిసిజిఎస్ 1694 వంటి కొత్త రకాల విత్తనాలను వినియోగిస్తున్నామని, జిప్సం వాడకం ద్వారా దిగుబడి పెరుగుతుందన్నారు. మొక్కజొన్న పంట డిప్పు సాగు పద్ధతులను ప్రోత్స హించడం వల్ల రైతుల అధిక లాభాలు గడిస్తున్నారన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడికాయలకు కవర్లు తొడగడం వల్ల నాణ్యత పెరిగి మార్కెట్లో మంచి ధర లభిస్తోందన్నారు. పశుసంవర్ధక శాఖ పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మన్నారు. కేంద్ర అధికారి సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు నిరంతనం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు అవలంబిస్తున్న ఉత్తమ సాగు పద్ధతులను సేకరించి వాటిని ఇతర రైతులకు కూడా తెలియజేయాలని ఆదేశించారు. విత్తనాలను, ఎరువులను సొసైటీల ద్వారా సకాలంలో రైతురకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, ఉద్యానవన అధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారి శుభాదాసు, కోఆపరేటివ్ అధికారి కృష్ణా నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణ కుమార్, పట్టు పరిశ్రమ అధికారిని శోభారాణి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ బాధ్యతలు చేపట్టిన పీడీ శ్రీదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి



కలెక్టరు పూల మొక్క అందజేస్తున్న ఐ సి డి ఎస్ పి డి శ్రీదేవి

**అనంతపురం కలెక్టరేట్ ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా బద్వేల్ నుండి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాల య సిబ్బందితో సిడిపిఓ లతో సమావేశం నిర్వహించి విధులలో ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వ కార్యకలాపాల్లో పాల్గొని బాధ్యతగా పనిచేయాలని సిబ్బందికి తెలియచేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ని కలిసిన నూతన ఐసిడిఎస్ పిడి ఎం.శ్రీదేవి పూల బుకే అందజేశారు. ఐసిడిఎస్ కార్యాలయ పరలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల పనితీరు. సూపర్వైజర్, సిడిపిఓల పనితీరు కార్యాలయ సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉండి పనిచేసే విధంగా బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ పిడికి చెప్పారు.

# హంద్రీనీవా పనులను వేగవంతం చేయండి

## జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



పనుల పురోగతిపై అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్

**పుట్టపర్తి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**

పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ద్వారా 195 చెరువులను నింపే ప్రక్రియను ప్రాధాన్యతగా తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అధికారులతో కలిసి హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాలువ పనులు మరియు పంప్ హౌస్‌లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. హంద్రీనీవా కాలువ యొక్క 344.90 కిలోమీటర్ (జానకంపల్లి పుట్టపర్తి రోడ్డు) వద్ద పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. కాలువ వెడల్పు, నీటి సామర్థ్యం మరియు ప్రవాహ వేగంపై హెచ్ ఎం ఎస్ ఎస్ ఎస్.ఈ రాజ్‌స్వరూప్ కలెక్టర్కు వివరణ ఇచ్చారు. కాలువలోని ఓటి 3 (343.250 కి.మీ) మరియు రెగ్యులేటర్ వద్ద పనులను పరిశీలించారు. ఈ ఓటి 3 ద్వారా సుమారు 143 చెరువులకు నీరు అందించే అవకాశం ఉన్నందున, ఆ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జానకంపల్లి వద్ద ఉన్న పంప్ హౌస్3 మరియు యార్డ్ పనులను తనిఖీ చేశారు. అక్కడ ఉపయోగిస్తున్న పైపులు, వాటికి వేస్తున్న కోటింగ్ పెయింట్ నాణ్యతా ప్రమాణాలను స్వయంగా పరిశీలించి, పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమము లో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఈ ఈ గిరిధర్ రెడ్డి, ఏ.ఈ.ఈ.లు మరియు ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్ ఫెంటాస్టిక్ బడ్జెట్

- రాయలసీమ ప్రాంతానికి సాగునీరు ఇస్తే రాష్ట్రానికి రైతులు అప్పులు ఇస్తారు - అసెంబ్లీలో తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్ ఫెంటాస్టిక్ బడ్జెట్ అని తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. అమరావతిలోని అసెంబ్లీ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే జె.సి అశ్విత్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికి సంక్షేమానికి పెద్దపీట వేసిందని, 2047 గమ్యానికి అనుగుణంగా రూపొందించడం జరిగిందన్నారు. నీటి పారుదల రంగానికి 18 వేల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. రెండు రోజులు క్రితం ముఖ్యమంత్రిని కలిసినప్పుడు తాడిపత్రి నియోజకవర్గంలో ఉన్న ప్రాజెక్టులకు సాగునీటి విడుదల జీవో కావాలని అడిగితే జీవో అవసరం లేదని చెరువులు రిజర్వాయర్లు నింపుదామని చెప్పి నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్ల కింద ఉన్న పిల్లకాలువలను పూర్తి చేయాలన్నారు. 2014లో అధికారంలో ఉన్నప్పుడు చాలా రిజర్వాయర్లు నిర్మించడం జరిగిందని రిజర్వాయర్లకు అనుగుణంగా పిల్ల కాలువలను ఏర్పాటు చేసి సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వం భావించిన 70 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. 2019లో అధికారం కోల్పోయిన తరువాత గత ప్రభుత్వం పిల్లకాలువల గురించి పట్టించుకోలేదన్నారు. వారు పూర్తి చేసి ఉండుంటే మనము అధికారంలో రావడానికి ఇబ్బందులు పడేవారమన్నారు. వారు అసెంబ్లీలో హేళన చేయడానికి ఎక్కువ సమయం తీసుకున్నారన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో చాగల్లు రిజర్వాయర్ కింద ఫ్లడ్ కెనాల్ ఉందని టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 70 శాతం పనులు పూర్తయ్యాయని 30 శాతం పనులు పెండింగ్‌లో ఉండడం వల్ల దాదాపు 30 వేల ఎకరాల భూములకు సాగునీరు అందించలేకపోయామన్నారు. కాలువ నిర్మాణం పూర్తి అయితే తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాలకు సాగునీరు పుష్కలంగా ఉండేదన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఉన్న మూడు రిజర్వాయర్ల కింద పిల్ల కాలువల నిర్మాణాలు పూర్తి చేస్తే దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చున్నారు సాగునీటి సరఫరా కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉన్నత స్థాయి అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాయలసీమ ప్రాంతంలో వచ్చి రాణి నీటితోనే పంటలు సాగు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారని పూర్తిస్థాయిలో రిజర్వాయర్ కింద ఉన్న ఇంటర్ లింకింగ్ కాలువలు నిర్మిస్తే హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెంది రాష్ట్ర ప్రభుత్వానికే అప్పు ఇచ్చే పరిస్థితిలో ఉంటుందని ఎమ్మెల్యే తెలియజేశారు.

## 33 కుటుంబాలకు పాడి ఆవులను ఇప్పిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్

అగళి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

మధూడి, కెంకెర గ్రామాల్లో ఉన్న 33 కుటుంబాల పేదలకు పాడి ఆవులను అందించి సాయం చేస్తామని గ్రామీణప్రాంతాల్లో చదివి అమెరికాలో స్థిర పడిన నమ్రత రెడ్డి తెలిపారు. మధూడి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. నన్ను నా కుటుంబం పాడి ఆవులపెంపకంతోనే చదివించారని మా తల్లిదండ్రులకష్టంతోనే ఈ స్థానిలో రాణించానని, అందుకు పుట్టిన గ్రామం కోసం ఏదైనా చేయాలన్న తపనతో ఈ పాడి ఆవులను 33 కుటుంబాలకు అందించడానికి సిద్దంగా ఉన్నామని తెలిపారు. తల్లిదండ్రుల సలహా మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆర్డిటి సంస్థ ద్వారా ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించానని తెలిపారు. మధూడి గ్రామంతోపాటు కెంకెర గ్రామం వద్ద మా పొలాలు ఉన్నాయని, అక్కడే పాడి ఆవుల పెంపకం జరిగిందని, ఆ గ్రామానికి కూడా సాయం చేస్తామని తెలిపారు. ఈ పాడి ఆవులను సద్వినియోగం చేసుకుని మీ కుటుంబాలు ఆర్థికంగా బలపడాలని, పిల్లలను బాగా చదివించాలని ఆకాంక్షించారు. మధూడి గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి , విజయలక్ష్మిలు తన కొడుకు ఈ వయస్సులోనే పేదల కోసం సాయం చేయాలనే ఆలోచనరావడం సంతోష దాయకమన్నారు. ఆర్డిటి చైర్మన్ సాగర్ మూర్తి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం దాతలు సాయం చేస్తామని ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూడిడి డైరెక్టర్ ఉషా, రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, ఏటిఎల్ ఓబులేషు, సర్పంచు శివకుమార్, సిఓ నాగమణి, రిటైర్డ్ ఆర్మి కల్లప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుడి వద్ద సీసీ కెమెరాలు నైట్ వాచ్మెన్ నియమించుకోండి : ఎస్సై శోభారాణి

- గణపతి దొంగల్ని పట్టుకోండి జడ్పిటిసి ఉమేష్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శోభారాణి

అగళి, ఫిబ్రవరి26 ప్రభాతవార్త

మండల కేంద్రంలో పురాతన శంకరేశ్వరస్వామి దేవాలయంలో గుప్త నిధుల తవ్వకందారులు ఇప్పటికే రెండుసార్లు తవ్వకాలు చేశారని స్టేషన్‌లో రెండు కేసులు ఇప్పటికే నమోదయ్యాయని తెలిపారు. గత నాలుగు నెలల క్రితం పురాతన 70 ఏళ్ల నాటి గణపయ్యను దొంగలు దోచుకెళ్లారు. సదరు విషయమై గ్రామస్తులతో ఎస్సై శోభారాణి పిలిపించి అవగాహన కల్పించారు. దేవాలయం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు నైట్ వాచ్మెన్‌ను నియమించుకోవాలని సూచించారు. అదేవిధంగా జడ్పిటిసి ఉమేష్ మాట్లాడుతూ.. దొంగలు దొంగలించిన గణపతి దొంగలను వెంటనే పట్టుకోవాలని ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని వారిని పట్టుకుని గట్టిగా శిక్షించాలని జడ్పిటిసి ఉమేష్ ఎస్సై శోభారాణికి వివరించారు.

## బాలికలకు హెచ్‌పివి టీకాను వేయించండి



మాట్లాడుతున్న హెల్త్ ఎంపిహెచ్ ఈవో మనోహర్ బాబు

కనగానపల్లి ఫిబ్రవరి 26 ప్రభాతవార్త


కేంద్ర ప్రభుత్వం ఈనెల 28వ తేదీ హెచ్పివి టీకా 14, 15 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలకు ఉచితంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుందని హెల్త్ ఎం పి హెచ్ ఈ ఓ మనోహర్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం నందు గురువారం హెచ్ పి వి టీకాపై సిహెచ్‌ఓ అంజలి, హెల్త్ ఎం పి హెచ్ ఈవో మనోహర్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హెల్త్ ఎంపీహెచ్‌ఈఓ మనోహర్ బాబు మాట్లాడుతూ 14 ,15 సంవత్సరాలు ఉన్న బాలికల తల్లిదండ్రులు హెచ్ పి వి టీకాను వేయించే విధంగా బాధ్యత తీసుకోవాలని ఈ టీకా వల్ల కౌమార దశలో ఉన్న బాలికలకు ప్రాణాంతకమైన సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) రానీయకుండా నివారిస్తుందని టీకా వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్తులో క్యాన్సర్ సోకకుండా రక్షణగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపర్తికి ఆర్టిసి బస్సు సౌకర్యాన్ని కల్పించండి

అమరాపురం ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

కర్ణాటక సరిహద్దున ఉన్న మారుమూల ప్రాంతమైన అమరాపురం మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రానికి అమరాపురం దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ ప్రాంతం నుండి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే నాలుగు చోట్ల బస్సులను ఎక్కి దిగాల్సి ఉందని అది కూడా సమయానికి బస్సులు లేని కారణంగా నానా ఇబ్బందులు పడాల్సి ఉందనిప్రజలు పేర్కొన్నారు. గతంలో పుట్టపర్తి నుండి అమరాపురంనకు బస్సు సర్వీస్ కూడా ఉండేదని అయితే ఆర్టీసీ అధికారులు గతంలో ఉన్నపలంగా ఆ సర్వీసును రద్దు చేయడంతో అప్పటినుండి పుట్టపర్తికి వెళ్లాలంటే ఈ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని కల్పించి ఆదుకోవాలని ప్రయాణికులు కోరుచున్నారు. గతంలో అనేకసార్లు మండల సమావేశంలో కూడా ప్రజా ప్రతినిధులు జిల్లా స్థాయి అధికారులకు విన్నవించిన కూడా ఫలితం లేకపోయిందని పేర్కొంటున్నారు. ఈ ప్రాంతం నుండి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పుట్టపర్తికి కల్పిస్తే కర్ణాటక ప్రాంతం నుండి కూడా అత్యధిక సంఖ్యలో భగవాన్ పుట్టపర్తి సాయిబాబా భక్తులకు కూడా సౌకర్యం కలుగుతుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి అమరాపురం నుండి పుట్టపర్తికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుచున్నారు

## రొళ్లలో ఒక్కలిగా కులస్తుల సమావేశం




రొళ్ల ఫిబ్రవరి25(ప్రభాతవార్త)

మండలంలోని రొళ్ల కొండ సమీపంలో గల శివాలయం ఆవరణంలో శనివారం ఉదయం 10 గంటలకు కుంచిటిగా ఒక్కలిగా కులస్తుల సమావేశం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర కుంచిట్టిగ వక్కలిగా సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప తెలిపారు. రొళ్ల మండల కుంచిటీగ ఒక్కలిగ సంఘం డైరెక్టర్ కాల పరిమితి ముగిసినందున మండలంలో డైరెక్టర్ నియామకం కులస్తుల సమక్షంలో ఎన్నుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి మండలంలో ఉన్నటువంటి కుంచిటీ ఒక్కలిగా కులస్తులు తప్పక హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## గుమ్మల్లకుంటలో 25 చీనీచెట్టు నరికివేత

బత్తలపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త




రైతులను ఆర్థికంగా దెబ్బతీసేందుకు కన్నబిడ్డల్లా చూసుకుంటున్న చీనీచెట్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు బాధిత రైతు మరిమడుగు మల్లిరెడ్డి అలియాస్ దాణా మల్లిరెడ్డి తెలిపారు. బాధిత రైతు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుమ్మల్ల కుంట గ్రామానికి చెందిన రైతు మల్లిరెడ్డి ప్రతి ఏడాది వేరుశనగ పంట సాగు చేసి నష్టపోతుండడంతో తనకున్న పొలంలో 2.10 ఎకరాల్లో రెండున్నర సంవత్స రాల 246 చీనీ చెట్లను సాగు చేశాడు. వాటిని సంరక్షించుకుంటున్నట్లు తెలి పారు. చెట్లు బాగా పెరుగుతున్నట్లు తెలి పారు. ఈ నేపథ్యంలో గురువారం పొలంలో గడ్డిని తొలగించేందుకు కూలీలు పిలిచినట్లు తెలిపారు. కూలీలు గడ్డిని తొలగించేందుకు పొలంలోకి వెళ్లగా తాను పెళ్లిళ్ల ఉండగా వెలుతున్నట్లు తెలిపారు. ఇంతలో కూలీలు పొలంకి వెళ్లి చెట్లు నరికివేసినట్లు సమాచారం ఇవ్వడంతో తిరిగి పొలంలోకి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. అందులో 25 చీనీ చెట్లను నరకి వేసినట్లు గుర్తించామన్నారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తానకు ఎవ్వరితోనూ శత్రుత్వం లేదని అన్ని పార్టీల్లోనూ తనకు స్నేహితులు, బంధువులు ఉన్నారని తానంటే గిట్టని వారు ఎవ్వరు చేశారో తెలియడంలేదన్నారు. తనకు ఎవరిపైనా అనుమానం లేదన్నారు. ఇలా రైతులను ఆర్థికంగా దెబ్బతీయడం బాదకర మన్నారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

## లేపాక్షి మండల పరిషత్ కో ఆప్షన్ స్థానం ఏకగ్రీవం

- వైకాపా అభ్యర్థి సింగిల్ నామినేషన్



డిక్లరేషన్ పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

లేపాక్షి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిషత్ కో ఆప్షన్ స్థానాన్ని వైకాపా కైవశం చేసుకుంది. లేపాక్షి మండల పరిషత్‌లో 13 ఎంపిటిసి స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో టిడిపి రెండు స్థానాలు కైవశం చేసుకోగా వైకాపా 11 స్థానాలు కైవశం చేసుకుంది. అయితే గత ఏడాది సిరివరం ఎంపిటిసి గంగమ్మ టిడిపి తీర్థం పుచ్చుకుంది. దీంతో టిడిపి మూడు స్థానాలు, వైకాపా పది స్థానాల్లో నిలచి ఉంది. ఈ నేపథ్యంలో వైకాపా కో ఆప్షన్ సభ్యులు బషీర్ గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో కో ఆప్షన్ స్థానానికి ఎన్నిక అనివారమైంది. గురువారం కో ఆప్షన్ స్థానానికి ఎన్నికలు జరిగాయి. పిఓ జనార్దన్‌రావు, ఎంపిడిఓ నరసింహులు, డిప్యూటీ ఎంపిడిఓ శ్రీనివాసులు, ఏవో కుళ్లాయప్పలు కో ఆప్షన్ స్థానానికి ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం ఎల్ఎస్ ఇర్ఫాన్‌ను కల్లూరు ఎంపిటిసి లీలావతి ప్రతిపాదించగా మానేపల్లి ఎంపిటిసి గంగమ్మ బలపరిచింది. ఉదయం 10 గంటలకు నామినేషన్ల పర్వం ముగిసింది. అప్పటివరకు ఇర్ఫాన్ ఒక్కడే కో ఆప్షన్స్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంటకు నామినేషన్స్ స్క్రూటీని నిర్వహించారు. నామినేషన్‌లో అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నట్ల నిర్ధారించారు. ఎల్ఎస్ ఇర్ఫాన్ ఒక్కడే నామినేషన్ వేశారు. దీంతో ఇర్ఫాన్‌ను కో ఆప్షన్ సభ్యులుగా ప్రకటించారు. అనంతరం పిఓ జనార్దన్‌రావు, తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపిడిఓ నరసింహులు, డిప్యూటీ ఎంపిడిఓ శ్రీనివాసులు డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు.

## ఐ కేర్ కంటి ఆసుపత్రి ప్రారంభోత్సవంలో రొళ్ల టిడిపి నాయకులు



నాయకులను సన్మానించిన ఆసుపత్రి యాజమాన్యం

రొళ్ల ఫిబ్రవరి25(ప్రభాతవార్త)

మడకశిర పట్టణంలో గణేష్ ఐ కేర్ కంటి ఆసుపత్రి ప్రారంభోత్సవం గురువారం జరిగింది.యాజమాన్యం పిలుపు మేరకు రొళ్ల మండల టిడిపి నాయకులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య నాయకులు రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. అనంతరం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి లోపాలున్న వారు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం సంబంధిత లోపాలున్న వారికి వైద్యులు సలహా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ డి శ్రీనివాస్ మూర్తి ఒక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి,మునిసిపల్ చైర్మన్ నరసింహ రాజు, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి,ఏపీ ఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ,క్లస్టర్ ఇంచార్జ్ భరత్ ,మీసేవ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన డాక్టర్ జి.వెంకట్రామయ్యకు సన్మానం



డా.వెంకట్రామయ్యను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

పావగడ తాలూకాలో ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ జి.వెంకట్రామయ్య కర్ణాటక రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా తాలూకాలోని జెడిఎస్ యువ నాయకుడు నల్లాని సురేంద్ర, డాక్టర్ జి.వెంకట్రామయ్యను గురువారం స్వగృహంలో కలిసి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వెంకట్రామయ్య మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీలో చేసిన సేవలను గుర్తించి నాకు ఈ పదవిని ఇచ్చారని, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పావగడ తాలూకాలో అధిక స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తానన్నారు. అభినందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంగాధర నాయుడు, శాంతి మెడికల్ దేవరాజు, కనికలబండ మూర్తి, శ్రీరామసేన రామాంజినేయ తదితరులు ఉన్నారు.

## పిఎల్‌డి బ్యాంక్ నామిని డైరెక్టర్‌ను సన్మానించిన జెడిఎస్ నాయకుడు నల్లాని సురేంద్ర

పావగడ, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

పావగడ తాలూకా పిఎల్‌డి బ్యాంక్‌కు నూతనంగా ఎన్నికైన నామిని డైరెక్టర్ హెచ్.తిమ్మరాజును గురువారం స్థానిక జెడిఎస్ యువ నాయకుడు నల్లాని సురేంద్ర సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## విగ్రహప్రతిష్టాపన కార్యక్రమాల్లో పరిటాలశ్రీరామ్

ప్రత్యేక పూజలు చేయించిన పరిటాలశ్రీరామ్



శాంతినగర్‌లో పునః ప్రతిష్టించిన వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న పరిటాలశ్రీరామ్, టీడీపీనాయకులు

ధర్మవరంటౌన్ , ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

పట్టణంలోని పలు కాలనీల్లో గురువారం జరిగిన దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ పాల్గొన్నారు. ముందుగా శాంతినగర్ లో శ్రీవరాలవరసిద్ధి వినాయక విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆలయ కమిటి ఆధ్వర్యంలో వైభవం గా నిర్వహించారు. గోపుర కలశప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలను భక్తి శ్రద్ధలను నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన పరిటాలశ్రీరామ్ కు ఆలయ నిర్వాహకులు, స్థానికులు ఘనస్వాగతంపలికారు. అనంతరం వినాయక విగ్రహానికి పరిటాలశ్రీరామ్ ప్రత్యేక పూజలు చేయించారు. ఆ తరువాత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని పరిటాల శ్రీరామ్ ప్రారంబించారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాలనీల్లో జరిగిన శ్రీసీతా రామలక్ష్మణ సమేతఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని పూజలు చేయించారు. స్వామివారి ఆశీస్సులు పటణ ప్రజలపై ఎప్పటికి ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరానని పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు చింతలపల్లి మహేశ్ చౌదరి, పరిశేసుధాకర్, సందారాఘవ, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్,జింకాపురుషోత్తం, మాదవరెడ్డి, కేశగాళ్ల శ్రీనివాసులు, అత్తార్ రహీం, సలీం భాష,మాబుసాబ్, పుల్లప్ప పాల్గొన్నారు.

## క్రియాశీలక సభ్యత్వాల్లో నియోజకవర్గం ఆదర్శంగా నిలిచేలా కృషిచేయండి




మాట్లాడుతున్న హిందూపురం పార్లమెంట్ సమన్వకర్త షేక్ రియాజ్

ధర్మవరంటౌన్ , ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

క్రియాశీలక సభ్యత్వాల్లో ధర్మవరం నియోజకవర్గం ఆదర్శంగా నిలిచేలా ప్రతి జనసేన కార్యకర్త కృషిచేయాలని హిం దూపురం పార్లమెంట్ సమన్వకర్త షేక్ రియాజ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిలు పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీకార్యాలయంలో గురువారం జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంబించారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు హిందూపురం పార్లమెంట్ కు జనసేన ఉద్యమి సభ్యత్వనమోదు కార్యక్రమానికి సమన్వయకర్తగా విచ్చేసిన షేక్ రియాజ్ ,రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకంమధుసూదన్‌రెడ్డిలు మాట్లాడారు...జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 5వ విడత క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంబించామన్నారు. ప్రతి క్రియాశీలక సాధక్ సమిష్టిగా కృషిచేసి ద్విగ్విజయం చేయాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గంలో వేలాది సంఖ్యలోసభ్యత్వాలు నమోదు చేసి గ్రామ,గ్రామాలకు, వార్డులకు ఈకార్యక్రమాన్ని తీసుకెళ్లి పండగ వాతావరణం నెలకొల్పాలని సూచించారు. కార్యకర్తల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సభ్యత్వ రుసుంను రూ.500 నుంచి రూ.400కు తగ్గించినట్టు వారు వెల్లడించారు. హిందూపురం పార్లమెంట్ పరధిలోని 7 నియోజకవర్గాల్లో ఎన్నడూ లేనివిధంగా సభ్యత్వాలు నమోదు చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని వారు కోరారు. పార్టీని కూడా గ్రామస్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేయాలని జనసేన నాయకులు కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు రాజారెడ్డి,అడ్డగిరిశ్యాంకుమార్, బెస్తశ్రీనివాసులు, నాగసుదాకర్‌రెడ్డి, డిష్ రాజు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిసత్యకుమార్ చొరవతో ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటువేగవంతం

- భూమి హ్యాండోవర్ పై తక్షణ చర్యలుకోరిన హ్యాండ్లూమ్ శాఖ

- వేలాది చేనేతకార్మికులకు ఉపాధి ఆశలు


ధర్మవరంటౌన్ , ఫిబ్రవరి 26 ప్రభాతవార్త




హ్యాండ్లూమ్ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందడుగు వేస్తున్న నేపథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు వేగవంతం అవుతున్నట్టు నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ దూరదృష్టి, ప్రత్యేక చొరవ, హ్యాండ్లూమ్ కార్మికుల సంక్షేమంపై ఉన్న కట్టుబాటు ఫలితగానే ఈ మెగా క్లస్టర్ కార్యరూపం దాల్చుతోందన్నారు. హ్యాండ్లూమ్ పరిశ్రమకు జాతీయస్థాయిలో గుర్తింపుపొందిన మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ప్రాజెక్టు అమలుకు అవసరమైన భూమిని వెంటనే హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ కు అప్పగించాలని సంబందిత అధికారులను శాఖకమిషనర్ రేఖారాణి ఉన్నతాదికారులకు అదికారిక లేఖ రాసి ప్రాజెక్ట అమలులో ఆలస్యం జరగకుండా భూమిని స్వాధీన పరచుకుని త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. ఈ మెగా క్లస్టర్ ను మార్కెట్ యార్డు ప్రాంగణంలో 9.84 ఎకరాల భూమిపై ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 25 సంవత్సరాల లీజు పద్ధతిలో భూమికేటాయింపుకు అనుమతి లభించినట్టు ఆయన తెలిపారు. జాతీయ హ్యాండ్లూమ్ అభివృద్ధి కార్యక్రమం కింద గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మద్దతుతో అమలవుతున్న ఈ ప్రాజెక్టుకు మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ ద్వారా నిధులు మంజూరై, తొలి విడతగా రూ.298.03 లక్షలు విడుదలైనట్టు ఆయన తెలిపారు. డిజైన్ స్టూడియో ఏర్పాటు, మార్కెటింగ్, బ్రాండింగ్ అభివృద్ధి, విలువ ఆధారిత ఉత్పత్తి యూనిట్లు, ప్రాజెక్టు అమలు సహాయక వ్యవస్థలు, హ్యాండ్లూమ్ కార్మికులకు ఆధునిక సదుపాయాల కల్పన వంటి సమగ్ర కార్యక్రమాల ద్వారా ధర్మవరం హ్యాం డ్లూమ్ రంగాన్ని జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని ఆయన వివరించారు.

## గురుకులలో ప్రవేశానికి మార్చిన పరీక్షలు

రొళ్ల ఫిబ్రవరి25(ప్రభాతవార్త)




మండలంలోని దొమ్మరహట్టి సమీపంలో గల అంబేద్కర్ గురుకుల పాఠశాల, ఇంటర్మీడియట్, ఐఐటి మరియు నీట్ విద్యార్థుల ప్రవేశానికి మార్చి 1న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ మైలారప్ప గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు.5వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, జూనియర్ ఇంటర్ జనరల్ పరీక్ష మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకూ జరుగుతాయి.6,7 తర గతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్ష మార్చి 8న జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగా చేరుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమా హాల్ టికెట్స్ ను https://apbragcet.apcfss.in వెబ్సైట్ ద్వారా హాల్ టికెట్స్ పొందవచ్చు అన్నారు.

## ఆటోమేషన్ పథకం రైతులకు ఉపయోగకరం



సదస్సులో మాట్లాడుతున్న శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అదికారి చంద్రశేఖర్

బత్తలపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

ఆటోమేషన్ పథకం అంటే దేశంలో ఎక్కడి నుంచైనా మొబైల్ ఉపయోగించి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలకు నీరు వృథా కాకుండా అందించవచ్చునని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్లు పేర్కొన్నారు. గురువారం మండలం సంజీవపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో. రైతులకు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఏపీఎంఐపీలో ఆటోమేషన్ పథకం గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోమేషన్ పథకం ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా మొబైల్ ఉపయోగించి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పండ్ల తోటలకు, కూరగాయల తోటలకు, మొక్కజొన్న, పత్తి. ద్రాక్ష. దానిమ్మ మొదలైన పంటలకు నీరు వృథా కాకుండా అందించడం జరుగుతుందన్నారు. ఆటోమేషన్ పథకంలో మోటర్ కంట్రోల్స్, కంట్రోల్ వాల్స్ ప్రభుత్వం రాయితీ మీద అందించడం జరుగుతుందన్నారు. చిన్న సన్నకారు రైతులకు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 55 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 45 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుందన్నారు. ఈ ఆటోమేషన్ ఉపయోగించి రైతు పంటకనుగుణంగా నీరు వృథా కాకుండా ఎంత సమయానికి ఎంత నీరు ఇవ్వాలో ఎక్కడి నుంచైనా అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం పట్ల ఆసక్తి ఉన్న రైతులు వారి వారి రైతు సేవ కేంద్రాలల్లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వీసీ ధనుంజయ్, ఎంపిఈఓ శివశంకర్, రైతు సేవ కేంద్రాల సిబ్బంది, ప్రతినిధులు, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బిల్లే సూరిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి



బిల్లే సూర్యనారాయణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకుని ఇంటి వద్ద కోలుకుంటున్న వైఎస్సార్సీపీ నాయకుడు బిల్లే సూర్యనారాయణను మాజీ మంత్రి మాలాగుండ్ల శంకర్నారాయణ. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వేరువేరుగా పరామర్శించారు. గురువారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని బిల్లే. సూర్యనారాయణ ఇంటి వద్దకు మాజీ మంత్రి మాలాగుండ్ల శంకరానారాయణ, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిలు విచ్చేశారు. గత నెల 25న రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న బిల్లే సూరేని వారు పరామర్శించారు. ప్రమాదంలో ఎలా జరిగింది. చికిత్సలు ఎక్కడెక్కడ చేయించారు. ఆరోగ్యం ఎలా ఉంది అంటూ ఆరా తీశారు. అధైర్యపడవద్దని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి వెంట వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, మండల ఉపాధ్యక్షులు పెద్దయ్య, మాజీ జెడ్పీటీసీ అక్కిం నరసింహులు, సర్పంచు ఆక్కిం దామోదర్, కో ఆప్షన్ మెంబర్ కరీంసాబ్, నాయకులు సంద్రా, రామకృష్ణ, పాల్యం అప్పస్వామి. ఈశ్వరయ్య, కోడేకండ్ల సోమశేఖర్, నెత్తవారంపల్లి మల్లిరెడ్డి, విల్లే వెంకట్, ఈడిగ కాశప్ప, మండల నారాయణ, వెంకటగారిపల్లి ఆదెప్ప, వెంకటరాముడు, చంటి. టైలర్ బాబా, నరసప్ప, వెంగన్న, ముసుగు అప్పస్వామి, చైతన్యరెడ్డి, లోకేష్, యర్రగుంట సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ సైన్స్ ల్యాబ్, స్పోర్ట్స్ రూంలు ప్రారంభం



మైక్ సెట్‌ను ప్రధాన ఉపాధ్యాయునికి అందిస్తున్న దృశ్యం


బుక్కపట్నం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

బుక్కపట్నం మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఇంటిగ్రేటెడ్ సైన్స్ ల్యాబ్, స్పోర్ట్స్ రూంలను ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల అధ్యక్షుడు కృష్ణారెడ్డి చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. 199091 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు దాదాపు 50 వేల రూపాయల ఖర్చుతో ఇంటిగ్రేటెడ్ సైన్స్ ల్యాబ్ కు పెయింటింగ్ వేయించినట్లు తెలియజేశారు. దీనితోపాటు అదే గ్రామలో ఉన్న ప్రాథమిక పాఠశాల కు తరుగుగువాండ్లపల్లికి చెందిన చెన్న కృష్ణారెడ్డి తనయుడు పదివేల రూపాయలు విలువ గల మెగా మైక్ సెట్ ను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్ కు అందించారు. ఆయన హెచ్ఎంఎల్ కాల్వ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత ఊరిలో చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పాఠశాలలకు ఏదో ఒక రూపంలో సహాయం అందించి విద్యార్థిని విద్యార్థులకి సౌకర్యాలు అందించేందుకు ముందుకు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు పాఠశాల కమిటీ చైర్మన్ చెన్నుడు, వెంకటాచారి, సత్య, దామోదర్, పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ లో పెండింగ్ లో ఉన్న పన్నులు వంద శాతం పూర్తి చేయాలి

- డి ఎల్ పీ ఓ విజయ్‌కుమార్

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్ పీ ఓ విజయ్ కుమార్

అనంత రూరల్ మండలం రాచనా పల్లి పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న వివిధ పన్నులు వంద శాతం పూర్తి చేయాలని డిఎల్‌పిఓ విజయ్ కుమార్ తెలియ జేశారు. గురువారం రాచాన పల్లిలోని గ్రామ సచివాల యంను అయన పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలితో కలసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పెండింగ్ ఉన్న వివిధ పన్నులు వసూల్ లో నిర్లక్ష్యం వహించకుండా వంద శాతం వసూళ్లను పూర్తి చేయాలని తెలియజేశారు.

## పదవ తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్
### - తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ 2 పరీక్షలు
### - షెడ్యూల్‌ను విడుదల చేసిన విద్యాశాఖ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య ఎస్సీఈఆర్టీ పదో తరగతి విద్యార్థులకు మార్చి 2 నుండి 12వ తేదీ వరకు గ్రాండ్ టెస్ట్ నిర్వహణకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్ఏపరీక్షలు నిర్వహించడానికి షెడ్యూల్ ను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ పరీక్షలు మరియు తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్ఏ॥ పరీక్షల షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని, దీని ప్రకారంగా పరీక్షలను నిర్వహిస్తామన్నారు.

**పరీక్ష నిర్వహణ కొరకు సూచనలు :** ప్రశ్నపత్రాలు ఎంఆర్సి వద్ద సురక్షితంగా నిల్వ చేయబడతాయి. మండల విద్యా అధికారి-1, మండల విద్యా అధికారి-2, ఒక పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడుతో ము గ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలి. ముగ్గురు సభ్యుల కమిటీ భద్రపరచబడ్డ ప్రశ్నపత్రాలు సంరక్షించ డానికి, పాఠ శాలలకు పంపిణీ చేయడానికి భాధ్యత వహిస్తారు. హెచ్ఎం, ఎంఈఓలు ప్రశ్నపత్రాల సమగ్ర తను నిర్ధారించాలి. ప్రతి సెషన్‌లో పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందు మాత్రమే ప్రశ్నపత్ర కట్టలను సంబంధిత పాఠశాలలకు అందజేస్తారు. పరీక్షలు సజావుగా, నిష్పాక్షికంగా జరుగుతున్నాయో లేదో తనిఖీ చేయడానికి క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సిఆర్పిలలో కలిసి) పరీక్షా సమయంలో పాఠశాలలను సందర్శించాలి. ఒకవేళ ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగినట్లయితే, హెచ్ ఎంలు, ఎమ్ ఈవోలు, సిఆర్ పిలు వెంటనే ఉన్న తాధికా రులకు రిపోర్ట్ చేయాలి. ఎంఈవోలు మరియు సిఆర్పిలు ప్రైవేట్ మరియు ప్రభుత్వ నిర్వహించే ఎస్సీ హెచ్లో పరీక్ష నిర్వహణ విధానాలను పర్యవేక్షించడంపై దృష్టి పెట్టాలి.

## బెస్త సేవా సంఘానికి జనరేటర్ వితరణ చేసిన బెస్త జయరామిరెడ్డి

అనంతపురం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త బ్యూరో

డబ్బున్న వాడు ప్రతి ఒక్కడు ధాత కాలేడు, దాన గుణం ఉన్నవాడే దాత అని బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కేవీ రమణ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన గురువారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ.. పేద వర్గంలో పుట్టిన జయరామి రెడ్డి, అనంతపురం నగరం నడిబొడ్డులో నిర్మించిన గంగపుత్ర కమ్యూనిటీ హాల్, గంగమ్మ పోలేరమ్మ దేవాలయాల సమూహానికి జనరేటర్ లేకపో వడం వల్ల పడుతున్న ఇబ్బందులను చూసి, మంచి మనసుతో 7.5కేబి గల జనరేటర్‌ను దానం చేసి బెస్త సేవా సంఘం అభివృద్ధికి తోడ్పడినందులకు జిల్లా బెస్త సేవా సంఘం తరఫున కృతజ్ఞతలు అభినందనలు తెలి యజేస్తున్నామన్నారు. ఇలా ప్రతి ఒక్కరూ ఆలోచన చేస్తే మన సంఘం ఆస్తులను మరింత విస్తృతంగా పేద ప్రజ లకు తక్కువ ఖర్చుకే అందుబాటులోకి తేవడానికి వీలవు తుందని, బెస్త కులస్తులందరినీ కోరుతున్నానన్నా రు. ఈ విషయం తెలిసిన వెంటనే స్పందించి అక్కడికి వెళ్లి జనరేటర్ తీసుకురావడానికి సహకరించిన బెస్త సేవా సం ఘం వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్‌కి జిల్లా ఉపా ధ్యక్షులు గంగప్పకి బెస్త సేవా సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

## పదవ తరగతి పరీక్షల విధులు కేటాయింపులో గందరగోళ పరిస్థితులు.. తక్షణమే సవరించాలి - ఏపీటీఎఫ్ 1938 నేతలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అమలు చేస్తున్న ఇన్విజిలేషన్ ఆటోమేషన్ విధానం కారణంగా పదో పరీక్షల నిర్వహణలో అధిక పరిపాలన కేంద్రీకరణ చోటుచేసుకుని, అనవసర గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, అంతే కాకుండా ఇది ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని కూడా దెబ్బతీసేలా ఉందని వాటిని తక్షణమే సవరించాలని అనంతపురం జిల్లా శాఖ.. జిల్లా విద్యాశాఖ అదనపు సంచాలకులు ము న్నీర్ ఖాన్‌కి వినతి పత్రం సమర్పించారు. ఎపిటి ఎఫ్ 1938 అనంతపురం జిల్లా శాఖ నాయలు లేఖ ద్వారా ఉదాహరణలతో వివరిస్తూ తెలియజేయడం జరిగింది. డిఈఓకి వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్,రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, జిల్లా పూర్వ అధ్యక్షులు రవీంద్ర,జిల్లా నాయకులు పోతులయ్య, ఆంజనేయులు నాయక్, తిరుపాల్ నాయక్, సురేష్, ఫక్రుద్దీన్, గోవిందరెడ్డి, ఇలియాజర్ తదితరులు ఉన్నారు.



డిఇఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపిటిఎఫ్ 1938 నేతలు

## వివాహ కార్యక్రమానికి హాజరైన ఎమ్మార్పిఎస్ నాయకులు

కూడేరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

ఎమ్మార్పిఎస్ జిల్లా నాయకులు పాల ఈశ్వరయ్య ఏకైక పుత్రిక శ్రీవిద్య వివాహ కార్యక్రమం గురువారం మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. వివాహ వేడుకకి అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పెండ్లి కుమార్తె శ్రీవిద్యను, పెండ్లి కుమారుడు సురేంద్రను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న, ఆయనతోపాటు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, లక్ష్మన్న, ఎంఆర్పిఎస్ మండల ఉపాధ్యక్షులు కమ్మూరు రాము, విహెచ్పిఎస్ జిల్లా నాయకులు కలగళ్ల ముత్యాలు, విహెచ్పిఎస్ మండల అధ్యక్షులు చోళసముద్రం శ్రీరాములు, వైయస్సార్సీపి దళిత నాయకులు, ఎర్రి నాగప్ప, కమ్మూరు ఎల్సీ సంగప్ప, వన్నూరప్ప, సిఎస్ఐ సెంటర్ నిర్వాహకులు వెంకటేశులు, విలేకరి ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులు చకారి ఎర్రిస్వామి, ఆంజనేయులు ఎంఎంఎస్ నాయకులు పరమేష్, నాగరాజు తదితర నాయకులు పాల్గొన్నారు..



నూతన వధువరులతో ఎమ్మార్పిఎస్ నాయకులు

## విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షా అట్టలు,పెన్నులు వితరణ చేసిన ఎస్ఐ

ఆత్మకూరు ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

విద్యార్థులు చిన్నప్పటినుండే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా విద్యను అభ్యసించాలని ఎస్ఐ గౌతమ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో పదవ తరగతి చదివే 110 మంది విద్యార్థిని, విద్యా ర్థులకు స్థానిక ఎస్ఐ గౌతమ్ పరీక్ష అట్టలు,పెన్నులు,పలు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ గౌతమ్ మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధిం చాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చే బాధ్యత మీదేన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాక్షించారు. సమాజ అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని తెలిపారు.

ప్రతి విద్యార్థి చిన్న ప్పుడు నుంచే సేవా భావం కల్గి వుండాలన్నారు. పరీక్ష సామాగ్రి ని విద్యార్థు లకు వితరణ చేసేన ఎస్ఐ గౌతమ్‌కు హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యా ర్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం లక్ష్మిదేవి, మండల విద్యాధికారులు, రామాంజినేయులు, నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు రామాంజినేయులు, కుమార్,శైలజ, పార్వతి, పద్మావతి,సుజాత,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ గౌతమ్,



విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేస్తున్న ఎస్ఐ

## సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం

అనంతపురం, ఫిబ్రవరి 26,( ప్రభాతవార్త బ్యూరో)

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ (బీఎఫ్ఎల్), బజాజ్ ఫిన్సర్ లో భాగమైన సంస్థ, అనంతపురంలో "నాక్‌అవుట్ డిజిటల్ ఫ్రాడ్" పేరిట సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. పౌరులను సైబర్ ముప్పుల నుంచి రక్షించేందుకు దేశవ్యాప్తంగా 100 నగరాల్లో చేపట్టిన సైబర్ భద్రతా ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. అరవింద నగర్‌లోని శ్రీ సాయిబాబా నేషనల్ డిగ్రీ కాలేజ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ టి. వేణుగోపాల్, కానిస్టేబుల్ షేక్ షావల్లి, రిటైర్డ్ డీఎస్పీ డి. నాగరాజ, కళాశాల ప్రిన్సిపాల్ డా. సరిత హాజర య్యారు. ఈ సందర్భంగా నకిలీ ఓటీపీ మోసాలు, ఫిషిం గ్, డిజిటల్ అరెస్ట్, లోన్ మరియు పెన్షన్ మోసాలు వంటి వివిధ సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మోసగాళ్లు నకిలీ ఉద్యోగ ఆఫర్లు, సులభ రుణ పథకాల పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరించి దుర్వినియోగం చేస్తున్నారని వివరించారు. బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రతినిధి మాట్లాడుతూ, వినియోగ దారుల ఆర్థిక భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ మార్గాల్లో నిరంతరం సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న సి.ఐ.వేణుగోపాల్

## రైతే రాజు - రెండు గ్రామాల్లోని కూలీలకు ఉపాధి కల్పిస్తున్న నాగూర్ ఈశ్వర్‌రెడ్డి

అమడగూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

అమడగూరు మండల పరిధిలోని చినగానపల్లి పంచాయతీ భావజాన్ కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగూర్ ఈశ్వర్‌రెడ్డి తనకున్న 10 ఎకరాల పొలంలో రెండు గ్రామాల్లోని కూలీలకు నిత్యం ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాలను ఆదుకుంటున్నారు.

కరువులో గానీ కాలానికి అనుగుణంగా ఆ రెండు గ్రామాల్లోని కూలీలకు పనులు కల్పిస్తూ మంచికి మారుపేరుగా రైతే రాజుగా నిలుస్తున్నారు. తన పొలంలో పెట్టే పంటలో నష్టం వచ్చినా లాభం వచ్చినా ఏమాత్రం భయపడకుండా క్రమం తప్పకుండా తమ పొలంలో టమాట, వేరుశనగ, మిర్చి తదితర పంటలు సాగుచేస్తూ దాదాపు 50 మంది కూలీలకు నిత్యం ఉపాధి కలిపిస్తూ వారి కుటుంబాలను ఆదుకుంటున్నారు. ఇలాంటి రైతు ప్రతి గ్రామంలో ఉండాలని ప్రతి దినం పనులు కల్పిస్తూ ఆదుకోవాలని కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పనులు చేస్తున్న కూలీలు

## పకడ్బందీగా ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరము పరీక్షలకు (జనరల్ విద్యార్థులు) 20855గాను 20517మంది హాజర య్యారు. 338 మంది గైర్హాజర్ కాగా, ఒకేషనల్ విద్యార్థులు 1931 గాను 1901 మంది హాజరుకాగా 30 మంది గైర్హాజరయ్యారైట్లు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కన్వీనర్ యం.వెంకటరమణ నాయక్ తెలియజేశారు. కన్వీనర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి 06 పరీక్షాకేంద్రాలను, జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి యస్.వి.యస్.గురవయ్య చెట్టి 05 పరీక్ష కేంద్రాలను, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 6 పరీక్షాకేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 08 పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు 13 పరీక్షాకేంద్రా లను తనిఖీ చేసినట్లు తెలిపారు. పరీక్షలను సిసి కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు.

## వివాహా కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన బండి రవీంద్ర కుమార్తె కళ్యాణి -మోహన్ బాబు దంపతుల వివాహానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వధించారు. ఆయ నతోపాటు వైఎస్‌ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు వివా హానికి హాజరయ్యారు.



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

## నారాయణపురం గ్రామానికి రోడ్డు కల్వర్టు కోసం యాభై లక్షలు మంజూరు చేయండి

కూడేరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

మండల పరిధిలోని పి.నారా యణపురం గ్రామంలో గ్రామం బయట నుండి గ్రామంలోకి వెళ్లే రహదారి వంకలో నుండి గ్రామంలోకి వెళ్లాలంటే ప్రయాణికు లు, వాహనాలు, ప్రజలు ప్రతి ఒక్కరూ వర్షాకాలం లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుపుతూ అమరావతిలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి ఆయన దృష్టికి టిఎన్టియుసి జిల్లా ఉపాధ్యక్షులు రోలర్ నాగరాజు తీసుకు వెళ్లడం జరిగింది. ఇందుకు మంత్రి వెంటనే కల్వర్టు నిర్మాణానికి సానుకూలంగా స్పందించారని రోలర్ నాగరాజు విలేకరులకు తెలియజేశారు.



ఆర్థిక శాఖ మంత్రిని కలి సిన టిఎన్టియుసి జిల్లా ఉపాధ్యక్షులు

## సజావుగా ముగిసిన మండల సర్వ సభ్య సమావేశం

శింగనమల, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం కోరం లేక వా యిదా పడ్డ మండల సర్వ సభ్య సమావేశం గురువారం ఆరు మంది ఎంపి టిసిలు హాజరుకావడంతో సజావుగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఓ భాస్కర్, డిప్యూటీ తహశీల్దారు, ఏఓ అన్వేష్‌కు మార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీందర్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి శైలజా, ఎం ఈఓ నరసింహ రాజు, డా.శంకర్‌నాయక్, శింగనమల ఎంపిటిసి-2 ఉమా, నిదనవాడ ఎంపిటిసి సునీత, ఉల్లికల్లు ఎంపిటిసి రఘునాథరెడ్డి, తరిమెల ఎంపి టిసి రమేష్, సోదనపల్లి ఎంపిటిసి సలకం చెరువు సర్పంచు ఆదినారా యణరెడ్డి, పెరవలి సర్పంచు రాజు, తరిమెల సర్పంచు ఓబుళేసు, చక్రాయు పేట సర్పంచు, గ్రామ సచివాలయ ఉద్యోగులు తదితరులు హాజరయ్యారు.





## నూతన ఐసిడిఎస్ పిడి బద్వేల్ శ్రీదేవికి శుభాకాంక్షలు తెలిపిన సిడిపిఓ చల్లా లలిత

శింగనమల, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

జిల్లా ఐసిడిఎస్ పిడిగా గురువారం బాధ్యతలు స్వీకరిం చిన బద్వేల్ శ్రీదేవి కి జిల్లా కేం ద్రంలోని ఐసిడిఎస్ కార్యాల యంలో శింగనమల సిడిపిఓ చల్లా లలిత మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెతోపాటు సీనియర్ అసిస్టెంట్ బాబా నూరుద్దిన్, ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీసాయినాథునికి పంచామృతాభిషేకాలు

యల్లనూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కస్తూరి బా గురుకుల పాఠశాల ఎదురుగా నూతనంగా నిర్మించిన శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువా రం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం బాబాకు పంచా మృతాభిషే కాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్న హారతి, కాకడాహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని బాబాను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



శ్రీషిరిడిసాంయిబాబాకు పూజలు నిర్వహించిన దృశ్యం

## వృద్ధులకు నిత్యావసరవస్తువులు పంపిణీ

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు గురువారం తాడిపత్రి పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలోని శ్రీవాసవి వృద్ధాశ్రమం లోని 75 మంది వృద్ధులకు వారి వద్దకే వెళ్లి నిత్యావసర వస్తు వులు పంపిణీ చేశారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని 1284050, 1284038 పరిధిలోని వృద్ధులకు నిత్యావసరవస్తువుల పంపిణీ పర్యవేక్షిం చారు. ఈ నెల తాడిపత్రి పట్టణ ప్రాంత పరిధిలోని రేషన్ కార్డుదారులకు ఒక కిలో గోధుమ పిండి 20 రూపాయలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి మల్లేష్‌ప్రసాద్, ఎఫ్‌పి షాప్ డీలర్లు పాల్గొన్నా రు.



నిత్యావసరసరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## రమణమహర్షి అనాథాశ్రమంలోని విద్యార్థులకు దుస్తులు పంపిణీ

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

తాడిపత్రి మండలం ఆవులతిప్పాయపల్లి వద్ద వున్న రమణ మహర్షి అనాధా శ్రమంలోని విద్యార్థులకు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. తాడిపత్రి పట్టణంలోని 32వవార్డు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మంగపట్నం లక్ష్మినారా యణ (లచ్చి) జన్మదినం సందర్భంగా 32వవార్డు కౌన్సిలర్ మంగపట్నం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో అనాథాశ్రమంలోని 150 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. అదేవిధంగా ఆశ్రమం పట్టణానికి దూరంగా ఉన్నందున అవసరాల నిమిత్తం పట్టణానికి రావడానికి ద్విచక్రవాహనాన్ని ఆశ్రమానికి అందచేశారు. అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చుకోట సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఆకట్టుకుంటున్న రాతిగుండు పోటీలు
### - పోటీల్లో మొదటి విజేత గోసానిపల్లి అర్జున్

యాడికి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

యాడికి మండల కేంద్రంలో వెలసిన శ్రీశివలక్ష్మీచెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జె.సి ఫ్యామిలీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆలయం ప్రాంగణంలో గురువారం రాతిగుండు పోటీలు ఘనంగా నిర్వహిం చారు. ఈ పోటీల్లో విజేతగా గోసానిపల్లి అర్జున్ నిలిచి మొదటి బహుమతి అందుకున్నాడు. మొదటి బహుమతి ని దాతలు టిడిపి నాయకులు దేరంగుల నాగశేఖర్, మధురాజు కలిసి 10 వేల రూపా యలు అందజేశారు. రెండవ బహుమతి విజేతగా నిలిచి న బళ్లారి జిల్లా కప్పగల్లు కర్ణకు విశ్వం 6 వేల రూపాయలు అందజేశారు. మూడవ బహుమతి విజేతగా నిలిచిన చిన్న మల్కాపురం రాఘువకు దాత టిడిపి నాయకులు నంద్యాల రంగస్వా మి 4 వేల రూపాయలు అందజేశారు. బహు మతులు అందించిన దాత లను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో యోగా గురువు గరిడి శివన్న, జనసేన మండల కన్వీనర్ సునీల్, టిడిపి మండల కార్యదర్శి దాసరి రామచంద్ర, వెంకటస్వామి, గుండా నారాయణస్వామి, పూలతోట రవి, యల్లపు రమణ, జనసేన కార్యద ర్శులు మధుఆచారి, నాగభూషణం, పప్పు వెంకటేష్, శివకోటి, రుద్ర, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



రాతిగుండు ఎత్తు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం





బహు మతులు అందచేస్తున్న దృశ్యం

## టెక్‌లో ప్రారంభమైన ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2కె26

తాడిపత్రిరూరల్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడి పత్రి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో- 2కె26 కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా కంప్యూటర్స్ విభాగం, డేటా సైన్స్ విభాగం, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, డిప్లొమా కళాశాల విద్యార్థులు పలు ఆవిష్కరణలు చేశారు. ముందుగా ఈ కార్యక్ర మాన్ని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు కె.షాలిని, కె.నిహారికలు లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం 27, 28వతేదీల్లో కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఆవిష్కరణలు ఉదయం 9.30 నుండి సాయంత్రం 3.45 గంటల వరకు అందు బాటులో వుంటాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐవి సుబ్బారెడ్డి తెలిపారు. ఆయా ఆవిష్కరణలను కళాశాల విద్యార్థులు చాలా విపులంగా హాజరైన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.నటరాజేశ్వర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంసి భానుప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న దృశ్యం



ఆవిష్కరణలు ప్రదర్శిస్తున్న దృశ్యం

## నలుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్
### - రూ.82,500 నగదు, 1 మోటార్‌సైకిల్, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది వద్దున తోట వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు జిల్లా ఎస్‌పి జగదీష్ ఆదేశాల మేరకు, తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి ఉత్తర్వుల మేరకు ఎస్ఐ ధరణిబాబు, స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి దాడులు జరిపి పేకాట ఆడుతున్న గునిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అలియాస్ రుస్తుమ్, పసుల వరుణ్‌కుమార్, బండి మైఖేల్, బొగ్గుల బాబులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 82,500/ రూపాయల నగదుతో పాటు 1 మోటార్ సైకిల్, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.



పేకాటరాయుళ్లను చూపుతున్న దృశ్యం

## 28వ తారీకు లోపు రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోండి

నంబులపూలకుంట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎన్ పి కుంట రైతు సేవ కేంద్రంలో ఈరోజు మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి కంది పంటపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కంది పంట సాగులో నేలకు అనుకూలంగా ఉండే విత్తన రకాల ఎంచుకోవాలని విత్తన శుద్ధిని పాటించాలని, అంతర పంటలుగా తక్కువ కాలపరిమితి గల మినుము, పెసర, తృణధాన్యాలు, వేరుశనగ వంటి పంటలను సాగు చేసుకోవడం వల్ల అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. సస్యరక్షణ విషయానికి వస్తే కంది పంటలో ముఖ్యంగా ఆకు చుట్టు పురుగు, కాయ తొలుచు పురుగు, మారుకా మచ్చల పురుగు నివారణ చర్యలపై వివరించారు. ఇప్పటి వరకు మండలంలో 840 మంది రైతులు ఇంకా రైతు విశిష్టత సంఖ్య నమోదు చేసు కోలేదు, ఈ యొక్క 11 అంకెల ఫార్మర్ యూనిక్ ఐడి నమోదు చేసుకోవడానికి ఫిబ్రవరి 28 వరకు మాత్రమే గడువు ఉంది, కనుక మిగిలి ఉన్న రైతులందరూ మీ సమీప రైతు సేవా కేంద్రంలో ఆధార్, భూమి పాస్ పుస్తకం వివరాలతో వెళ్లి త్వరగా నమోదు చేయిం చుకోవాలని తెలిపారు. ముఖ్య గమనిక ఏమంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే పీఎం కిసాన్ యొక్క తదుపరి విడతల సాయం నిలిచిపోతుందని వారు తెలి యజేశా రు. రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసు కొని రైతులు ముందు మీ భూమి రికార్డులు సక్రమంగా అప్డేట్ చేయబడ్డాయా లేదా అని నిర్ధారించుకోవాలి, మీ సేవలో మొబైల్ నెంబర్ ఇచ్చి ఆధార్ సీడింగ్ చేయిం చుకోవాలి, అలాగే వెబ్ ల్యాండ్‌లో మ్యుటేషన్ అప్డేట్ చేయించు కోవాలి, చివరగా నమోదు ప్రక్రియలో ఆటంకాలు రాకుండా ఖాతా సంఖ్యను ముందస్తుగా ధ్రువీకరించుకొని రావాలని సూచించారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి

## జూదరులు అరెస్టు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

పోలీసులకు అందిన సమాచా రం మేరకు మండలంలోని యాదలవాండ్ల పల్లి గ్రామ సమీపంలోని కంపచెట్ల లో పేకాట జూదం ఆడు తున్న 10 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 6,050/ రూపా యలు డబ్బులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన ట్లు పోలీసులు తెలియజేశారు.



జూదరులను అరెస్టు చేస్తున్న దృశ్యం

## ఆలయ గర్భగుడి నిర్మాణానికి రూ 10. 5 లక్షలు విరాళం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని కోటగడ్డ శ్రీ సీతారామ లక్ష్మణ గర్భగుడి నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన పిన్ని వెంకటప్ప కుటుంబ సభ్యులు రూ 1050116 లక్షలు గురువా రం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. భూరీ విరాళాన్ని అందించి ఆలయ నిర్మాణంలో భాగస్వా మ్యం అయిన పిన్ని కుటుంబ సభ్యులు పిన్ని వెంకటకృష్ణయ్య, పిన్ని సురేష్ బాబు, పిన్ని నాగరాజు, పిన్ని నరసింహాబాబు వారి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు. పిన్ని కుటుంబ సభ్యులపై ఆ దేవుని కృపా కటాక్షములు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.



ఆలయ నిర్మాణానికి చెక్కును అందజేస్తున్న పిన్ని కుటుంబ సభ్యులు

## బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు.. కేసు నమోదు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :

మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ లో గురువారం పలు బెల్ట్ షాపులను ఎక్సైజ్ ఎస్పీ గోవిందు నాయక్ తనిఖీలు చేశారు. అలాగే మండల కేంద్రంలోని నేషనల్ హైవే పై ఉన్న ఓ డాబాను తనిఖీ చేశారు. డాబాలో మద్యం సేవిస్తున్న వారికి నిబంధనలు మేరకు డాబాల్లో మద్యం సేవించరాదని హెచ్చరించారు.

డాబాల్లో మద్యం విక్రయాలు చేపట్టరాదని నిర్వాహకులను హెచ్చరించినట్లు తెలిసింది. బెల్ట్ షాపు, డాబాలపై తనిఖీల పై ఎక్సైజ్ ఎస్పీ గోవిందు నాయక్ ను వివరణ కోరగా ఓడిసిలోని పలు బెల్ట్ షాపులు, డాబాలపై దాడులు చేశామని ఐతే నేను విలేకరులకు ఏవిధమైన సమాచారం ఇవ్వనని, నేను ఏ విలేకరితోను మాట్లాడనని కరాఖండిగా చెప్పడం విశేషం.

## వివాహ వేడుకకు హాజరైన కాకర్ల

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని పుట్లూరురోడ్డులో వున్న ఏఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన వివాహ వేడుకకు కాకర్ల రంగనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియచేశారు.



04ATP26_04ATP26.qxd 26-02-2026 PM 11:14 Page 1



## అసెంబ్లీలో ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి

### - సాగునీటి సమస్యలపై మరోసారి వాణి వినిపించిన పరిటాల సునీత
### - హంద్రీనీవా ద్వారా పలు చెరువులకు నీరందించాలని విజ్ఞప్తి

రాప్తాడు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

హంద్రీనీవా పీఏబిఆర్ కాల్వలను అనుసంధానం చేసి నిర్దేశిత చెరువులకు సాగునీరు అందించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేశారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మరోసారి రాప్తాడు నియోజకవర్గంలో సాగునీటి సమస్యలపై తన వాణి వినిపించారు. జీరో అవర్ లో ఆమె మాట్లాడుతూ పిఏబిఆర్ కుడి కాలువ ద్వారా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లోని చెరువులకు ప్రతి ఏటా నీరు విడుదల చేస్తున్నా.. ఎప్పుడూ కనీసం 30శాతం కూడా ఇవ్వలేదన్నారు. దీని వలన రైతులకు నిరాశ మిగులుతోందని పంటలు నష్టపోతున్నారన్నారు. అందుకే ఆత్మకూరు మండలంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి అదే మండలంలోని పీఏబీఆర్ కుడి కాలువకు లింక్ కెనాల్ ఏర్పాటు చేస్తే రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలలోని సుమారు 50చెరువులకు సాగు నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ఆత్మకూరు మండలం వేపచెర్ల సమీపంలోని గోపాలప్ప కుంటకు నీరం దిస్తే.. 5వందల ఎకరాల్లోని వంద బోరుబావులకు ఉపయోగం చేకూరుతుందన్నారు. బండమీదపల్లి చెరువుకు వస్తున్న పిల్ల కాలువ నుంచి 2కిలో మీటర్లు కొత్తగా కాలువ ఏర్పాటు చేస్తే.. పాలబావి, చెర్లోపల్లి, చాపట్ల, మరూరు, ముక్తాపురం చెరువులకు నీరు అందించవచ్చన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లి సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువ ద్వారా కనుముక్కల ఎర్ర చెరువు, మేడాపురం చెరువుకు నీరు ఇస్తే వెంకటంపల్లి, ఓబులంపల్లి, ఒంటికొండ, చిన్న మొగలయిపల్లి, పెద్ద మొగలయిపల్లి, మేడాపురం, కనుముక్కల, వెల్దుర్తి గ్రామాల రైతులకు ఉప యోగం చేకూరనుందన్నారు. ఈ కాలువ నిర్మాణానికి 6కోట్ల 30 లక్షలతో అంచ నాలు కూడా తయారు చేశారని.. వీటికి నిధులు అందించాలని కోరారు. మరో వైపు పేరూరు ప్రాజెక్టు పనులు పునఃప్రార ంభంతో పాటు రైతులకి వ్వాల్సిన పరిహా రం మంజూరు చేసినం దుకు ముఖ్య మంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞ తలు తెలిపారు. ఇదే ప్రాజెక్టు 2018లో ప్రారంభిం చగా..జగన్ రెడ్డి వచ్చాక అన్ని పనులు ఆగిపోయాయని ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు చేశారు...


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

## సత్య సాయి బాబా వాటర్ ప్రాజెక్టును యధావిధిగా కొనసాగించండి

### - ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా త్రాగునీరు కల్పించాలని త్రాగునీటి కొరత తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఆనాడు సత్యసాయి సప్లై వాటర్ ప్రాజెక్టును బాబా తీసుకొచ్చారని పుట్టపర్తి నియో జకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. విజయవాడ అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సత్యసాయి త్రాగునీటి పథకంలో ఎదురవుతున్న ఇబ్బందులను కార్మికుల సమస్యలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా ప్రజలకు కలియుగ ప్రత్యక్ష దైవమన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమ ప్రజల దాహార్తిని తీర్చడానికి 1997లో ఈ ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. ఈ ప్రాజెక్టు కింద 273 వ్యక్తిగత ప్రాజెక్టులు 19 ఇతర స్కీములు మరో 5 మిగతా స్కీమ్ లు కొనసాగుతున్నాయి ఇందులో 1341 గ్రామాలకు 16.41 లక్షల మంది ప్రజలకు త్రాగునీరు అందిస్తోందన్నారు. అయితే ఈ సత్య సాయి ప్రాజెక్టును ఈ మధ్య జిల్లా పరిషత్ బోర్డు కు అప్పగించడం జరిగిందన్నారు. దీనివల్ల ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా జరిగే అవకాశం తక్కువగా ఉందనిన్నారు. జిల్లా పరిషత్ కింద ఈ ప్రాజెక్టు ఉంటే నిర్వహించడం కూడా ఎం తో కష్టమన్నారు. మరి ముఖ్యంగా ఈ సత్యసా యి వాటర్ సప్లై ప్రాజెక్టు అనేది భగవాన్ శ్రీ సత్య సాయి బాబా డ్రీమ్ ప్రాజెక్టు అన్నారు. ప్రభుత్వం తక్షణం సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టును జిల్లా పరిషత్ నుంచి తొలగించి తిరిగి సత్యసాయి త్రాగినీటి పథకంగా కొనసాగించేలా చేసి అందులో పని చేస్తున్న 596 మంది కార్మికులకు న్యాయం చేయాలని ప్రభు త్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు ను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు.


అసెంబ్లీలో మాట్లాడు తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

## పుట్టపర్తిలో ఇండోర్ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రారంభించిన రత్నాకర్,కలెక్టర్,ఎస్పీ

పుట్టపర్తి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

శ్రీ సత్య జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఇండోర్ బ్యాడ్మింటన్ అకాడమీని శ్రీ సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ బాబు పాల్గొని ప్రారం భించారు. తొలుత రిబ్బన్ కత్తిరించి, బాబా చిత్రపటానికి పూజలు నిర్వహించి త్రిబుల్ ఎస్ బ్యాడ్మింటన్ అకాడమీని ప్రారంభిం చారు. ముందుగా నిర్వాహకులు కనకంటి నిరంజన్ రెడ్డి, నంజి రెడ్డి లను వారు అభినందించారు. ఇండోర్ కోర్టులో కాసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పుట్టపర్తి కేంద్రం ఉజ్వల ఫౌండేషన్ వద్ద మంచి వాతావరణం లో ఇండోర్ క్రీడా కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. నేటి ఒత్తిడి ప్రపంచంలో.. భౌతిక శరీరానికే కాక.. మానసిక ఉల్లాసానికి సైతం ఇటువంటి క్రీడలు ప్రతి ఒక్కరికి ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్ర మంలో పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


ఇండోర్ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రారంభిస్తున్నజిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్


బ్యాడ్మింటన్ ఆడుతున్న శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ఆర్జే రత్నాకర్

## ఏళ్ల తరబడి అర్ధాంతరంగా ఆగిన టిడ్కో ఇళ్లను పూర్తి చేయండి - ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి

రాయదుర్గం ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

రాయదుర్గం పట్టణంలో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విన్నవించారు. అసెంబ్లీలో గురువారం ఆయన టిడ్కో ఇళ్ల గురించి ప్రస్తావించారు. రాయదుర్గం పట్టణంలో గత తెలుగుదేశం పార్టీ అధికారంలో 2017 18లోరూ.64.81కోట్ల వ్యయంతో టిడ్కో బహుళ అంతస్తుల గృహ సముదాయ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇదివరకే దాదాపు రూ. 40కోట్లమేరా ఖర్చుపెట్టి 70శాతం నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మిగిలిన నిధులు కేటాయించి నిర్మా ణాలు పూర్తి చేయగలిగితే 1008 పేద కుటుంబాలకు నివాసం కల్పించవ చ్చాన్నారు. ఏళ్ళ తరబడి పేదలు ఎంతో ఆశతో వాటికోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం వెం టనే పనులు చేపట్టి వచ్చే దసరా పండుగ నాటికి అందులో గృహనివాసం కల్పించాలని కోరారు.


ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

## సమాజానికి మార్గదర్శకులు జర్నలిస్టులు కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్

### కలెక్టరేట్ లో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

జర్నలిస్టులు సమాజానికి మార్గదర్శకులు అని కలెక్టర్ మరియు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం ఉదయం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో 2026 27వ సంవత్సరానికి సంబంధించి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ పం పిణీ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరియు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నియమ నిబం ధనలను అనుసరించి అర్హత కలిగిన ప్రతి ఒక్క జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేయాలన్నారు. అక్రిడిటేషన్ కార్డులను జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులై ఉండి ఇంకనూ మిగిలిపోయి ఉన్న జర్నలిస్టులకు త్వరలోనే రెండవ దఫా కమిటీ సమావేశంలో మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం మేరకు అనంతపురం జిల్లాలో తొలి విడతగా 607 అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేయనున్నామని ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ మరియు డిఎంఏసి మెంబర్ కన్వీనర్ ఏ.బాలకొ ండయ్య తెలిపారు. ఈరోజు నుంచి అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో పని దినాలలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఏ.షఫీఉల్లా, ఆర్.రామంజినేయులు, ప్రసాద్, ఐ.అండ్.పీఆర్ ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, పిఆర్ఓ వి.సూర్యనారాయణ రెడ్డి, టైపిస్ట్ దామోదర్ రెడ్డి, టెక్నీషియన్ కమల్, ఫోటోగ్రాఫర్ కోటప్ప, తదితరులు పాల్గొన్నారు.

## వంకలూ వదలట్లేదు..రెవెన్యూ కదలట్లేదు..!

### ః అక్రమమట్టి తవ్వకాలకు రెవెన్యూ సహకారం..?

యాడికి(తాడిపత్రి), ఫిబ్రవరి 26, ప్రభాతవార్తః

కొందరి కాసుల కక్కుర్తి అటు పేద రైతులకు, ఇటు పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమిస్తోంది. ధనార్జనే ధ్యేయంగా కొందరు రెవెన్యూ అధికారులు, అక్రమార్కులు కలసి చెలరేగిపోతున్నారు. ఎలాంటి అధికారిక అనుమతి పొందకుండా కొందరు అక్రమార్కులు వంకల్లో మట్టిని యథేశ్చగా దోచుకుపోతున్నా రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

తమకు నచ్చనివాళ్లు ఎవరైనా ట్రాక్టరు మట్టి తరలించుకుపోతుంటే వెంటనే సిబ్బందిని పంపించి జప్తు చేయించే రెవెన్యూ అధికారులు..నిత్యం తమతో అంట కాగే అక్రమార్కులు పెద్దపెద్ద యంత్రాలు పెట్టి వందలాది టిప్పర్లు తరలిస్తున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడం రెవెన్యూ అధికారులు అందిస్తున్న సహకారానికి నిదర్శనమని చెప్పవచ్చు. యాడికి మండలం పెద్దపేట వంకలో దళిత రైతుల భూముల వద్ద రోజుల తరబడి యంత్రాలతో తవ్వుతూ..తోడుతూ,పెద్ద పెద్ద టిప్పర్లతో తరలిస్తున్నా.. తాము గమనించిన తర్వాత ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిద ర్శనమని బాధిత రైతులు వాపోతు న్నారు. కూర్మాజి పేటకు చెందిన పరిమి చరణ్ అనే వ్యక్తి సర్వే నం.796లో ఉన్న తన పొలానికి ఆనుకొని ఉన్న వంకలో హిటాచీలతో పెద్ద పెద్ద గోతులు తవ్వి అక్రమంగా మట్టిని తరలించాడని, తన భూమిని వ్యవసాయం చేసుకోవ డానికి పనికి రాకుండా చేశాడని బాధిత రైతు సతీష్ గురువారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి, సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశాడు. ఇదేమని తామడిగితే బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొ న్నాడు. ఈ విషయంపై సీఐ శ్రీనివాసులు స్పందిస్తూ అది పూర్తిగా రెవెన్యూ అధికారులకు సంబంధించినది కావడంతో తదుపరి చర్యలకై రెవెన్యూ అధికారులకు లేఖ రాశామని తెలిపారు.


దళితరైతుల భూమి గట్ల వద్ద చేపట్టిన అక్రమ మట్టి తవ్వకాలు

## దరఖాస్తు పట్టాదారుల భూమి స్వాధీనం ః పరిహారంపై అన్నదాతల్లో ఆందోళన

యాడికి(తాడిపత్రి), ఫిబ్రవరి 27, ప్రభాతవార్తః

యాడికి మండలం కమలపాడు వద్ద 950 మెగావాట్లతో నిర్మిస్తున్న పంపు స్టోరేజీ ప్రాజెక్టు కోసం దరఖాస్తు పట్టా(డి.పట్టా) భూములను స్వాధీనం చేసుకునే విషయంపై విచారించడానికి సదరు రైతులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 27లోగా రైతులతో విచారణ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో డి.పట్టా రైతులతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. కమలపాడు రెవెన్యూ పరిధిలో 53 మంది, కుందనకోట పరిధిలో 33 మంది డి.పట్టా రైతులున్నట్లు, వారికి పరిస్థితిని వివరించి భూ సేకరణ సులభతరం చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు యాడికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కమలపాడు, కుందనకోట రైతులతో తహసీల్దార్ సమావేశమై పరిస్థితిని వారికి వివరించారు.

ప్రజా ప్రయోజనార్థం డి. పట్టా భూములను స్వాధీనం చేసుకుంటున్న తరుణంలో అభ్యంతరాలేమైనా ఉంటే తగిన ఆధారాలతో ఈ నెల 27లోగా హాజరై రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని రెవెన్యూ అధికారులు సూచించారు. అలా రైతులు ఎవరైనా హాజరు కాకపోతే మీ నుంచి అభ్యంతరం లేదని భావించి ప్రభుత్వ నిబంధనల మేరకు ఆయా రైతుల అనుభవంలో ఉన్న డి.పట్టా భూములను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని అధికారులు అన్నదాతలకు ఇచ్చిన తాఖీదులో పేర్కొనడం విశేషం. అయితే తాము కోల్పోతున్న డి.పట్టా భూములకు పరిహారం ఇస్తారా లేదా..ఇస్తే ఏ మేరకు ఇస్తారనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.


దరఖాస్తు పట్టాదారులతో చర్చిస్తున్న తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి

## విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ లో బాగంగా గురువారం నిర్వహించిన క్రీడలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొన్న దృశ్యాలు














## డంపింగ్ యార్డులో రీసైక్లింగ్ వ్యర్థాల వర్గీకరణ పక్కాగా వుండాలి

### - కమిషనర్ ఎం.జస్వంతరావు

అనంతపురం ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

స్థానిక గుత్తిరోడ్డులో వున్న డంపింగ్ యార్డులో సెగ్రిగేషన్ వ్యర్థ వర్గీకరణ ప్రక్రియ పక్కాగా వుండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంత రావు సంబంధిత ఆరోగ్య, ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన డంపింగ్ యార్డును పరిశీలిస్తూ వ్యర్థాలను వేరుచేసే విధానానిన, ప్లాస్టిక్, ప్లాస్టిక్ రహిత పదార్థాల వర్గీకరణ ప్రక్రియను పరిశీలించారు. వచ్చే నెల 21 తేదీలోపు డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ డిఈ జ్యోతి, జిగ్మా కంపెనీ నిర్వహణ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ షాకీర్‌హుస్సేన్, ఇన్‌చార్జ్ ఎంహెచ్ఓ, డిఈ బి.ఎల్.నరసింహా, ఏఈ హరిష్ తదితరులు పాల్గొన్నారు.


డంపింగ్ యార్డులో పరిశీలిస్తున్న కమిషనర్, సంబంధిత అధికారులు

## ఆర్టీసి ఎండిని కలిసిన రీజనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం ఫిబ్రవరి26 ప్రభాతవార్త

ఆర్టీసి నూతన ఎండిగా బాధ్యతలు చేపట్టిన బాల సుబ్రమణ్యంను కడప ఆర్టీసి రీజనల్ చైర్మన్, అనంతపుం జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు విజయవాడలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జోనల్ పరిధిలోని పలు సమస్యలను ఎండి దృష్టికి తీసుకెళ్లారు. స్త్రీశక్తి పథకం అమలుపై రీజనల్ పరిధిలో సురక్షిత ప్రయాణానికి తీసుకున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.


ఆర్టీసి నూతన ఎండికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందలను తెలుపుతున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు


## హైకోర్టు ఆదేశాల బేఖాతరుపై బాధితుడి ఫిర్యాదు

### ః తహసీల్దార్‌కు చెప్పినా ఉలుకూ, పలుకూ లేదు
### ః కలెక్టర్, ఎస్పీలకు బాధితుడు నర్రా రంగస్వామి ఫిర్యాదు

యాడికి(తాడిపత్రి), ఫిబ్రవరి 26, ప్రభాతవార్తః

మండల పరిధిలో రాయలచెరువులోని సర్వే నం. 258-ఎ లో యథాతథ స్థితి కొనసాగించమని హైకోర్టు ఆదేశాలున్నా అటు అధికారులు, ఇటు కొందరు వ్యక్తులు బేఖాతరు చేయడంపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి ఇటీవల ఫిర్యాదు చేసినట్లు బాధితుడు నర్రా రంగస్వామి తెలిపాడు. హైకోర్టు వివాదంలో ఉన్న మా స్థలంలో 30 టిప్పర్లకు పైగా శిథిలాలు, వ్యర్థాలను దౌర్జన్యంగా వదిలారని, ఈ సమస్యపై యాడికి తహసీల్దార్‌కు చరవాణి ద్వారా సమాచారమిచ్చినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. హైకోర్టు స్టేటస్ కో ఉన్న సదరు భూమిలో ఇలాంటి చర్యలను అడ్డుకోమని వేడుకున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు, ఈ సమస్య పరిష్కారానికి మరోసారి హైకోర్టును ఆశ్రయించడం మినహా మరో మార్గం లేదని రంగస్వామి ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. ఈ నెల 23న వేలూరు రంగయ్య, పరిమి చరణ్, మదమంచి శివ, మదమంచి రాఘవ, వినయ్ తదితరులు వ్యర్థాలు వదలి నా భూమిని నిరుపయోగంగా మార్చారని, నా భూమిలో ఎందుకు వ్యర్థాలు, శిథిలాలు వదులుతున్నారని ప్రశ్నించగా తహసీల్దార్ సూచనల మేరకే వదులుతున్నామని వారు చెప్పడాన్ని కూడా ఉన్నతాధి.కారులకు ఫిర్యాదు ద్వారా తెలియజేయడం విశేషం. గతంలో కూడా ఈ వ్యక్తులపై ఫిర్యా దు చేసినట్లు, యాడికిలో వారిపై కేసు నమో దైన విషయాన్ని కూడా ఫిర్యాదులో బాధితుడు ఉటంకించాడు. ఈ చర్యలన్నింటిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకొన కపోతే హైకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు వేయనున్నట్లు రంగస్వామి కుటుంబ సభ్యులు తెలిపారు.


సర్వే నం.258-ఎ లోకి తరలిస్తున్న శిథిలాలు, వ్యర్థాలు


జిల్లా పరిపాలనా, పోలీసు అధికారులకు బాధితుడు చేసిన ఫిర్యాదు